


12న 'శ్రీనివాస'లో యువజన దినోత్సవం

ప్రజాశక్తి-కాట్రేనికోన

చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 12న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవం నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాస కుమార్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. విద్యార్థుల్లో నైతిక, ఆదర్శ విలువలు పెంపొందించేందుకు క్విజ్, వక్తృత్వ, వ్యాసరచన పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 12న యువ జనోత్సవంలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. వివేకానందుని స్ఫూర్తిని విద్యార్థుల్లో నింపేందుకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఎం.వెంకటేశ్వరరావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగ రక్షణే ధ్యేయం

- యుటిఎఫ్ ప్రతినిధుల సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్
- 3వ రోజు సాగిన ప్రతినిధుల సభ
- నేడు నూతన కమిటీ ఎన్నిక, పలు తీర్మానాలకు ఆమోదం



మహాసభలో సౌహార్ద సందేశం ఇస్తున్న కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వ విద్యా రంగం రక్షణే ధ్యేయంగా కదలాలని, దీని కోసం అందరూ నడుం బిగించాలని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ పిలుపునిచ్చారు. కాకినాడ పిఆర్ కళాశాల ఆవరణలో జరుగుతున్న యుటిఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభలో మంగళవారం మూడోరోజు కొనసాగింది. ఇందులో భాగంగా యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అధ్యక్షతన ప్రతినిధుల సభను నిర్వహించారు. ఈ సభలో రాష్ట్ర కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడారు. భవిష్యత్తు కర్తవ్యాలు గురించి వివరించారు. దేశంలో, రాష్ట్రంలో విద్యారంగం ప్రపంచ బ్యాంకు కనుసన్నల్లో నడుస్తూ, కార్పొరేటీకరణ, ప్రయివేటీకరణ జరుగుతుందన్నారు. ఫలితంగా పేదలకు విద్య దూరమవుతోందని, ప్రమాద పరిస్థితులు ఏర్పడబోతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో విద్యారంగాన్ని కాపాడ్డానికి ప్రతి ఉపాధ్యాయుడు నడుం కట్టాలన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో 24 వేల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను సింగిల్ టీచర్ పాఠశాలలుగా మారబోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంటులో చట్టం చేయకుండా కేంద్రం తెచ్చిపెట్టిన నూతన విద్యా విధానం-2020 విద్యా వ్యాపారానికి అనువుగా మారిందన్నారు. ప్రభుత్వ బడులను, ఉద్యోగ ఉపాధ్యాయులను పరిరక్షించుకోవడానికి భవిష్యత్తు ఉద్యమాలకు ఉపాధ్యాయులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. 16వ విద్యా మహాసభల్లో రాష్ట్ర యుటిఎఫ్ సభ్యత్వం 80 వేల ఉండగా 17వ మహాసభలకు లక్ష పైనే దాటిందని తెలిపారు. యుటిఎఫ్ పట్ల ఉపాధ్యాయులకు ఉండే నిబద్ధతకు ఇది ప్రతీక అన్నారు.



ఎంవిఎస్.శర్మ



వి.బాలసుబ్రహ్మణ్యం



కెఎస్ఎస్.ప్రసాద్

ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు చైతన్యవంతమై సమాజానికి దిశ నిర్దేశకులు కావాలన్నారు. సోషల్ మీడియాకు బానిసలు కారాదన్నారు. దేశంలో పలు రకాల శక్తులు తమ పన్నాగాలను పబ్బం గడుపుకోవడానికి రకరకాల కార్యక్రమాలతో ప్రజల మధ్య విద్వేషాలు పెంచి వారి ఆలోచనలు పక్కదోవకు పట్టించడానికి ప్రయత్నిస్తున్నాయన్నారు. దీన్ని గమనంలో ఉంచుకోవాలన్నారు. దేశ సమగ్రత లౌకిక తత్వం కాపాడుకోవడానికి సాయిశక్తులా కృషి చేయాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యుటిఎఫ్ ఉపాధ్యాయులు సమైక్యంగా ఉండాలన్నారు. పిల్లలు సాంకేతిక దృక్పథంవైపు నడిపించాలన్నారు. పిడిఎఫ్ ఎంఎల్‌సి, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బొర్రా గోపిమూర్తి సంఘం ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు. ఐక్య ఉపాధ్యాయ పత్రిక నివేదికను ఎన్.కుమార్‌రాజా, ఆడిట్ కమిటీ నివేదికను రాష్ట్ర కమిటీ అధ్యక్షులు టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు, ప్రచురణల కమిటీ నివేదికను అధ్యక్షులు ఎం.హనుమంతరావు, మహిళా కమిటీ నివేదికను ఎఎన్.కుసుమకుమారి, రాష్ట్ర యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం నివేదికను ఎస్‌పి.మనోహర్ కుమార్ ప్రవేశపెట్టారు. వీటిని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. తొలుత ఇటీవల మరణించిన పలువురు ప్రముఖులకు సభ్యులు నివాళులర్పించారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా నిర్వహించిన పలు కార్యక్రమాల్లోనూ, యుటిఎఫ్ అకాడమిక్ అంశాల్లోనూ ప్రతిభ చూపిన వారికి జ్ఞాపికలు అందించారు. సభలో పాల్గొన్న ముఖ్య అతిథులకు జ్ఞాపికలు అందించారు. అనంతరం జిల్లాల వారీగా సమీక్ష జరిగింది. సాయంత్రం యుటిఎఫ్ సాంస్కృతిక దళం ఆలపించిన విప్లవ గీతాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కె.సురేష్ కుమార్, ఎస్.కుసుమకుమారి, రాష్ట్ర కార్యదర్శులు ఎన్.అరుణకుమారి, వి.శ్రీలక్ష్మి, బి.సుభాషిణి, ఎస్.కిషోర్ కుమార్, రెడ్డి మోహన్‌రావు, టి.అన్నారాం, ఎస్.జ్యోతిబసు, కాకినాడ జిల్లా యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.నరేష్, పి.చక్రవర్తి, యుటిఎఫ్ కృషి రాష్ట్ర పత్రిక బాధ్యులు ఐ.ప్రసాదరావు, చిలుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గురువులతోనే సమాజంలో మార్పు : కలెక్టర్

సమాజంలో ఏదైనా మార్పు రావాలంటే అది గురువుల ద్వారా మాత్రమే సాధ్యమని కాకినాడ కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అన్నారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభకు మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి సౌహార్ద సందేశం ఇచ్చారు. ఉపాధ్యాయులంతా కూడా సమాజాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. తన తల్లిదండ్రులు కూడా కడప జిల్లాలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. గురువులు తమ వృత్తి ద్వారా గౌరవాన్ని పెంచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను యుటిఎఫ్ తరుపున ఆయనకు జ్ఞాపికను ఇచ్చి సత్కరించారు. తరువాత యుటిఎఫ్ సంక్షేమ పథకం బాండ్‌ను ప్రారంభించారు.



గ్రూపు చర్చల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు



నివాళులర్పిస్తున్న సిపిఎం కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు తదితరులు

సిపిఎం నేత రాఘవమ్మ ఇకలేరు...

పలువురి నాయకుల సంతాపం

ప్రజాశక్తి-అమలాపురం, అయినవిల్లి



సిపిఎం నాయకురాలు కుడిపూడి రాఘవమ్మ (72) ఇకలేరు. ఆమె కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం తొత్తరమూడిలో కన్ను మూశారు. ఆమె భర్త గతంలోనే మృతి చెందారు. ఆమెకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె అంత్యక్రియలు స్వగ్రామమైన తొత్తరమూడిలో బుధవారం జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. రాఘవమ్మ మృతికి సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు సంతాపం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాఘవమ్మ మరణం ఉద్యమాలకు తీరని లోటన్నారు. వ్యవసాయ కూలీ పోరాటాలు, మద్యపాన వ్యతిరేక పోరాటాల్లో రాఘవమ్మ క్రియా శీలకంగా పనిచేశారని కొనియాడారు. పార్టీ, ప్రజా సంఘాల్లో పలు కీలక బాధ్యతలు నిర్వహించినట్టు తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయ కార్మిక సంఘం అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షురాలిగా, రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా కొనసాగుతున్నారని తెలిపారు. అయినవిల్లి మండలం తొత్తరమూడికి చెందిన రాఘవమ్మకు భర్త ఒక కుమారుడు ఇద్దరు కుమార్తెలు. భర్త కుడుపూడి నరసింహమూర్తి వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. ఆయన గతంలోనే మరణించారు. ఆయన సిపిఎంలో క్రియాశీలకంగా పని చేశారు. ఆయన ప్రోత్సాహంతో రాఘవమ్మ ప్రజా ఉద్యమాల్లో కి వచ్చారు. భర్త మరణం అనంతరం కూడా ఆమె పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నారు. 1990లో కోనసీమలో ఉవ్వెత్తున జరిగిన కూలీ పోరాటాలు, భూస్వామ్య వ్యతిక పోరాటాల్లో ఆమె కీలక పాత్ర పోషించారని తెలిపారు. వెంకటాయపాలెంలో శిరోముండనం ఘటనలో ఆమె ప్రత్యక్షంగా పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. రాఘవమ్మ మృతికి వ్యవసాయ కార్మిక సంఘం అఖిల బారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బి.బలరాం, అంద్ర మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు చల్లా రవికుమార్, డివి.రాఘవులు, ఎన్.బలరాం, జి.దుర్గాప్రసాద్, కె.కృష్ణవేణి, టి.నాగవరలక్ష్మి, డి.లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటి కార్యదర్శి సఖిలే సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు తాడి శ్రీరామ్మూర్తి, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు, యూటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.సురేంద్ర, ఎంటివి.సుబ్బారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కె.శంకర్ కో కన్వీనర్ కె.ప్రణీత్, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసిరావు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి.ఎస్తేరురాణి, కార్యదర్శి మలకా సుభాషిణి, అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు బి.వెంకటలక్ష్మి, కోశాధికారి పి.అమూల్య తదితరులు సంతాపం తెలిపారు.

అందరికీ ఆరోగ్యం కోసం పైలట్ ప్రాజెక్ట్

ప్రజాశక్తి-రామచంద్రపురం

సమాజం బాగుండాలంటే అందరికీ సంపూర్ణ ఆరోగ్యం ఉండాలనే స్ఫూర్తితో రామచంద్రపురంలో పైలెట్ ప్రాజెక్టు చేపట్టినట్టు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలియజేశారు. మంగళవారం మంత్రి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఒక పక్క అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూనే మరో పక్క సామాజిక సేవా కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడుతున్నామని. ఇప్పటికే వికలాంగులు, వితంతువులు, వృద్ధులు, నిరుద్యోగులకు తగిన సాయం అందిస్తున్నామని, ఎవరికి కష్టం వచ్చినా ఆదుకుంటున్నామని తెలిపారు. నియోజకవర్గంలో ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండాలనే లక్ష్యంతో 'ఆరోగ్యమే మహాభాగ్యం' పైలట్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ మేరకు హెల్దీ హార్ట్ మిషన్ ద్వారా హార్ట్ ఎటాక్‌లు నియంత్రించేందుకు కార్యాచరణ రూపొందించామని తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమానికి, ప్రముఖ వైద్యులు కోట సతీష్‌తో పాటు, సిఎస్ఆర్ నిధులను ఇచ్చేందుకు ఒక ప్రైవేటు కంపెనీ సహకారం తీసుకుంటున్నామని తెలిపారు. నామమాత్రపు రుసుములతో వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం వ్యక్తిగత నిధులను కూడా కేటాయిస్తానని మంత్రి సుభాష్ హామీ ఇచ్చారు. రక్తనిధి, అనాథాశ్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


ప్రజాశక్తి -మామిడికుదురు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చని సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు అన్నారు. పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా పాశర్లపూడిలంకలో మంగళవారం బ్లీచింగ్ చల్లించారు. మురికిగుంటల్లో దోమల నివారణకు ఎబేట్ మందు స్ప్రే చేయించారు ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి డి.సురేష్ పాల్గొన్నారు.



పారిశుధ్య పనులు చేయిస్తున్న సర్పంచ్, కార్యదర్శి

కార్టూ'నిజం'



వాడివేడిగా కపిలేశ్వరపురం మండల సమావేశం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండలం సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు పాల్గొన్నారు. సమావేశంలో గ్రామాల్లోని పలు సమస్యలపై ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. సమావేశానికి సకాలంలో ఐదుగురు కార్యదర్శులు హాజరు కాకపోవడంపై ఎంఎల్‌సి తోట ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంపిడిం కె.రత్నకుమారిని ఆదేశించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆయన విమర్శించారు. అనంతరం ఎంపిడిఒ రత్నకుమారి శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జెడిపిటిసి పుట్టపూడి అబ్బు, ఎంపిడిఒ కె.రత్న కుమారి, తహశీల్దార్ చిన్నారావు, వైస్ ఎంపిపిలు గుణ్ణం భాను ప్రసాద్, సాక శ్రీనివాస్, మండల ప్రత్యేకాధికారి కామేశ్వరరావు, గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

'ఆటలతో ఆరోగ్యం' పోటీల ప్రారంభం

క్రీడలు శారీరక మానసిక ధృడత్వానికి దోహదం చేస్తాయని పలువురు అన్నారు. మంగళవారం 'ఆటలతో ఆరోగ్యం' క్రీడోత్సవాలను జిల్లావ్యాప్తంగా ప్రారంభించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

రామచంద్రపురం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నియోజకవర్గంలోని కె.గంగవరం మండలంలోని పామర్రు హైస్కూల్లో క్రీడా పోటీలు ప్రారంభించారు. ఈ కోనసీమ సంక్రాంతి క్రీడోత్సవం కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక బలానికి మార్గం, శారీరక దఢత్వానికి పునాది అన్నారు. క్రీడలు మన జీవితంలో కేవలం వినోదం మాత్రమే కాదు, నిబద్ధత, జట్టుగా పని చేయడం, మానసిక స్థైర్యం వంటి విలువల్ని నేర్పించే సాధనం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పంపన నాగమణి పాల్గొన్నారు.

అమలాపురం విద్యా బోధనతో పాటు ఆసక్తిగల క్రీడలలో ఉత్సాహంగా పాల్గొని, పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. కొమరగిరిపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన క్రీడ ఉత్సవాల పోటీలను ప్రారంభించారు. మండల స్థాయిలో 4, 5, 6 తరగతుల విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు మెడల్, ప్రశంసా పత్రాలు అందిస్తామని, మండల స్థాయిలో గెలుపొందిన వారు జిల్లాస్థాయి పోటీలలో పాల్గొంటారని జిల్లా స్థాయిలో నిలిచిన విజేతలకు మెడల్స్ ప్రశంసా పత్రాలను బహూకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులు పిఎస్ సురేష్ కుమార్, ఎంపిడిఒ కృష్ణమోహన్, స్థానిక ప్రజాప్రతినిధులు విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

మామిడికుదురు నిత్యం సెల్‌ఫోన్లతో గడుపుతూ మానసిక ఒత్తిడికి గురవుతున్న పిల్లలలో క్రమశిక్షణ, ఆరోగ్యం పెంపొందించేందుకు క్రీడలు దోహదపడతాయని పి.గన్నవరం ఎంఎల్‌ఎ గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. మామిడికుదురు హైస్కూల్ ఆవరణలో క్రీడలను ఎంఎల్‌ఎ ప్రారంభించారు. మండల పరిధిలో 12 పాఠశాలల నుంచి 130 మందికి క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కుసుమ వనజకుమారి, నామన రాంబాబు, పి.గన్నవరం నియోజకవర్గ సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాత కాపు, పెదపట్నంలంక సర్పంచ్ సుందరనేడి రాజేష్ కుమార్ (చిన్ని), ఎంపిటిసి కొమ్ముల జంగమయ్య, బోనం బాబు, జనసేన మండల అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా, పాశర్లపూడి ఉప సర్పంచ్ తుండూరి బుజ్జి, ఎంఇఒలు లక్ష్మీనారాయణ, వెంకన్న బాబు, ఎంపిడిఒ కె.వెంకటేశ్వరరావు, హెచ్ఎం సిహెచ్.నిరంజని పాల్గొన్నారు.

ముమ్మిడివరం జెడ్‌పిటిసి కుడిపూడి శివ శంకర రావు నగర పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో క్రీడా పోటీలను తొలి తోజు క్రీడలలో వాలీబాల్‌లో ముమ్మిడివరం గేదెలంక జెడ్పి బాలుర పాఠశాలలు, కబాడీ పోటీలలో ముమ్మిడివరం బాలికలు, గాడిలంక బాలికలు ఫైనల్ పోటీలకు ఎంపికైయ్యారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి డి.శాంతిలక్ష్మి, ఎంపిడిఒ టిఎస్.వెంకటాచార్య, ఎంఇఒ ఆర్.ఉదయభాస్కర్ ఇఒపిఆర్‌డి సిహెచ్.లక్ష్మీ కల్యాణి, హెచ్ఎం బి.హనుమంత రావు, సిహెచ్.పరిమళ, పీడీ రాంబాబు, రమాదేవి, సుజాత, విజయ కుమారి ఇందిరా ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం మహాత్మా గాంధీ కళాశాల మైదానంలో క్రీడా పోటీలను మండల ప్రత్యేకాధికారి వెంకటరామారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బికెఎస్ఎస్.వెంకట్ రామన్, ఎంఇఒలు వరప్రసాదరావు, పచ్చ సాహెబ్, పరిపాలన అధికారి రామ స్వరూప్ పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం భీమనపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జెడ్‌పిటిసి గెడ్డం సంపదరావు పోటీలను ప్రారంభించారు. వివిధ విభాగాల ఆటల పోటీలను సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, ఎంపిటిసిలు దేశంశెట్టి నాగరత్నకుమారి, నాగులపల్లి శేషవేణి, ఎస్ఎంసి చైర్మన్ గుర్లింక చిన్న ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మంచెం బాబి, యాళ్ల సత్తిబాబు, మండల ప్రత్యేకాధికారి ఎంఎ.షంషీ, ఎంపిడిఒ పిఆర్‌సి రాజ్ కుమార్, హెచ్ఎం ఎన్.సత్యనారాయణ, పీడీలు కామన ప్రభాకరరావు, గొలకోటి ఫణీంద్ర కుమార్, పి.విగ్నేశ్వరుడు, కరాటం ప్రసాద్, సీతాపతి, సురేష్, వి.కుమార్, వి.విజయభాస్కర్, డి.సరస్వతి, ఎ.ఐశ్వర్య పంచాయతీ కార్యదర్శి పెట్టా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అయినవిల్లి ఎంఎల్‌ఎ గిడ్డి సత్యనారాయణ సిరిపల్లి శ్రీజయంతి రామయ్య పంతులు జిల్లా పరిషత్ హైస్కూల్లో క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గన్నవరపు శ్రీనివాసరావు, తహశీల్దార్ నాగలక్ష్మి, ఎంపిడిఒ జి.భీమారావు, అయినవిల్లి సర్పంచ్ కాకర శ్రీనివాసరావు, కూటమి నాయకులు మద్దాల చంటిబాబు పాల్గొన్నారు.

ఆలమూరు టిడిపి మండల అధ్యక్షుడు మెర్ల గోపాల స్వామి, ఎంపిడిఒ ఎ.రాజు, ఎంఇఒ బి.అప్పాజీ కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోటీలను ప్రారంభించారు. పోటీలకు అబ్జర్వర్‌గా కోనసీమ ఇండస్ట్రీస్ జిఎం ఆర్‌కెపి.ప్రసాద్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాతి లావణ్య కుమార్ రాజా, ఎఎంసి మాజీ చైర్మన్ ఈదల నల్లబాబు, ఈదల సత్తిబాబు, సర్పంచులు ఏడిద సత్యశ్రీ మెహర్ ప్రసాద్, తోట భవాని వెంకటేశ్వర్లు, పీడీలు సత్తిబాబు, గంగవేణి పాల్గొన్నారు.

కాట్రేనికోన మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని డిఇఒ షేక్ సలీం బాషా పేర్కొన్నారు. కాట్రేనికోన జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడలను ఆన మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి నేల కిషోర్ కుమార్, సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగిడి నాగేశ్వరరావు, నీటి సంఘం అధ్యక్షుడు వాసంశెట్టి రాజేశ్వరరావు, విత్తనాల బుజ్జి, ఎంపిడిఒ వెంకటాచలం, విద్యాశాఖ అధికారి వెంకటరమణ పాల్గొన్నారు.



రామచంద్రపురంలో విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్



మామిడికుదురులో క్రీడలను ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ గిడ్డి సత్యనారాయణ



అమలాపురంలో క్రీడలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

పలు పాఠశాలల్లో డిఇఒ తనిఖీలు

ప్రజాశక్తి-కాట్రేనికోన

ప్రభుత్వ పాఠశాలల్లో అపరిశుభ్ర వాతావరణ పరిస్థితులున్నా, విద్యార్థులకు అసౌకర్య వాతావరణం ఏర్పడితే సహించేది లేదని జిల్లా విద్యాశాఖాదికారి డాక్టర్ షేక్ సలీం బాషా హెచ్చరించారు. మండలంలోని పలు పాఠశాలలను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెయ్యేరు జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆటస్థలంలో రాళ్ల గుట్టలుగా ఉండడం, తరగతి గదుల వెంబడి ఆరు బయట చెత్తా చెదారం ఉండడంపై ఆయన ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఇటువంటి అపరిశుభ్ర వాతావరణంలో విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తే అనారోగ్యాలకు గురవుతారని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారంటూ హెచ్ఎం ఎ.శేషసాయిని ప్రశ్నించారు. పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత హెచ్ఎం, ఉపాధ్యాయులదే నన్నారు. పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రాన్ని ఆయన సందర్శించారు. భవిత కేంద్రం నిర్వహణ పట్ల సంతప్తి వ్యక్తం చేశారు. అనంతరం కాట్రేనికోన జెడ్‌పి ఉన్నత పాఠశాలను సందర్శించారు. మండల స్థాయి క్రీడా పోటీలను సందర్శించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. హెచ్ఎం ఎం.వెంకటేశ్వరరావుతో కలిసి తరగతిగదులను సందర్శించిచారు. అనంతరం దొంతుకుర్రు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సందర్శించారు. రెండు వారాలకు సంబంధించి రెండు రంగుల్లో ఉన్న కోడిగుడ్లు ఉండడాన్ని గమనించారు. గైర్హాజరైన విద్యార్థుల కోడిగుడ్లు ఉంటే వాటిని మిగిలిన విద్యార్థులకు అదనంగా అందజేయాలని, అంతేకాని కుళ్లిన స్థితికి తీసుకుని వచ్చి నిరుపయోగంగా మార్చవద్దన్నారు. అనంతరం పల్లం ఉన్నత పాఠశాలను, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. కారు వెళ్లేందుకు వీలులేని నీళ్లరేవు పాఠశాలను ఆయన బైకుపై వెళ్లి పరిశీలించారు. కాట్రేనికోన ఉన్నత పాఠశాల నుంచి ఇంగ్లీష్, వ్యాయామ ఉపాధ్యాయులను పాఠశాలలో బోధన చేసేందుకు సర్దుబాటు చేయాలని ఎంఇఒ ఎం.వెంకటరమణకు సూచించారు.



నీళ్లరేవు పాఠశాలలో సందర్శించిన డిఇఒ షేక్ సలీమ్ బాషా

నేరాలు ఘోరాలు

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఒక వివాహిత మహిళ అదృశ్యమైన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని బొబ్బర్లంకకు చెందిన జెట్టం జ్యోతిర్మయికి మూడేళ్ల క్రితం వివాహం అయ్యింది. ఏడాది తరువాత వారు విడిపోయి విడాకులు తీసుకున్నారు. బొబ్బర్లంకలో ఉంటూ ధవళేశ్వరంలో కుట్టు మిషన్ నేర్చుకోవడానికి వెళుతోంది. ఈ నెల 5న ఉదయం ధవలేశ్వరం వెళ్లి తిరిగి రాలేదు. దీంతో జ్యోతిర్మయి సోదరుడు సతీష్ కుమార్ పరిసర ప్రాంతాలు, బంధువుల ఇళ్ల వద్ద వెతికినప్పటికీ ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. మంగళవారం పోలీసులు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

పేకాడుతున్న 9 మంది అరెస్టు

ప్రజాశక్తి - ఆలమూరు

మండల పరిధిలో పలు పేకాట శిబిరాలపై రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్ ఆధ్వర్యంలో మంగళవారం దాడి చేశారు. 9 మందిని అరెస్టు చేశారు. ఆయన మాట్లాడుతూ కోడిపందేలు, పేకాట, గుండాటలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వివాహేతర సంబంధమే హత్యకు కారణం

ప్రజాశక్తి-కె.గంగవరం

కె.గంగవరం మండలం కూళ్లలో సోమవారం రాత్రి జరిగిన యువకుని హత్య కేసు వివరాలను ఎస్ఐ జానీ బాషా వెల్లడించారు. గ్రామానికి చెందిన సత్తి సువర్ణరత్నం, మంచాల వెంకట సూర్యారావు స్నేహితులని, సువర్ణ రత్నంకు తన భార్యతో వివాహేతర సంబంధం ఉందని సూర్యారావు అనుమానించాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి రత్నంను మందు పార్టీ చేసుకుందామని పిలిచాడు. అధిక మొత్తంలో మద్యం సేవించడంతో అతడు స్పృహ కోల్పోయాడు. సూర్యారావు బీరు బాటిల్ పగలగొట్టి రత్నం గొంతు వద్ద గాయం చేశాడు. అయినా ప్రాణం ఉందని గమనించి పక్కనే ఉన్న కాలువలో పడుకోబెట్టి మట్టిలో కూరుకుపోయేలా తొక్కడంతో రత్నం మృతి చెందాడు. మృతుని అన్న సత్తి ఆనంద్ ప్రసాద్ ఫిర్యాదు మేరకు కె.గంగవరం పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

కొత్తపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం..కొత్తపల్లి గ్రామానికి చెందిన అడపా సూరిబాబు ఉప్పాడ - పిఠాపురం ప్రధాన రహదారి సమీపంలో ఉన్న తన ఇంటి వద్ద ద్విచక్రవాహనాన్ని పార్కింగ్ చేస్తుండగా మరో ద్విచక్రవాహనదారుడు వేగంగా ఢీకొట్టాడు. దీంతో సూరిబాబు తలకు తీవ్ర గాయమైంది. దీంతో కుటుంబ సభ్యులు కొత్తపల్లి పిహెచ్‌సికి తరలించారు. ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం క్షతగాత్రుడిని కాకినాడకు తరలించారు.



ప్రమాదంలో పగిలిపోయిన మద్యం కేసులు

మద్యం వాహనానికి ప్రమాదం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట-పిఠాపురం రోడ్డులో మద్యంతో వెళ్తున్న వాహనాన్ని మరో వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మద్యం కేసులు పగిలిపోయాయి. డ్రైవర్‌కు గాయాలయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం సామర్లకోట ఐఎంఎల్ డిపో నుంచి మద్యం కేసులతో డి.పోలవరం వెళుతున్న వాహనాన్ని పిఠాపురం వైపు నుంచి వస్తున్న వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో మద్యం కేసులు పెద్ద ఎత్తున పగిలిపోయాయి. వాహన డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాక సిబ్బంది

పొగాకు బేరన్‌లో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని రామయ్యపాలెం గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున పొగాకు బేరన్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. రామయ్యపాలెం గ్రామానికి చెందిన గొల్లవిల్లి బాబురావుకు చెందిన పొగాకు బేరన్‌లో అగ్ని ప్రమాదానికి గురియింది. బేరన్‌లో సుమారు రూ.1.50 లక్షల విలువ చేసే పొగాకు ఉందని రైతు తెలిపారు. పొగాకుతోపాటు, బేరన్ కూడా పూర్తిగా కాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంటలను ఆర్పేందుకు కూలీలు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. హుటాహుటీనా అగ్నిమాపక యంత్రాంగం వచ్చి మంటలను అదుపు చేసిన ఫలితం లేకుండా పోయింది. అప్పటికే పొగాకుతోపాటు, బేరన్ కూడా పూర్తిగా కాలిపోయిందని రైతు బాబూరావు కన్నీరుమున్నీరు అయ్యారు.

విఘ్నేశ్వరాలయాన్ని సందర్శించిన జెసి

అయినవిల్లి : జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి ఆలయాన్ని మంగళవారం సందర్శించారు. ఆమెకు ఇఒ ఆలయ సత్యనారాయణ రాజు స్వామి చిత్రపటాన్ని సమర్పించారు. అనంతరం ఆలయ అభివృద్ధి, యాత్రికుల సౌకర్యాలపై జెసి ఆరా తీశారు. ఆలయంలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిస్తున్నట్టు జెసి తెలిపారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దారు నాగలక్ష్మి అమ్మ, ఎంపిడిఒ జి.భీమారావు పాల్గొన్నారు.

యానాం వార్తలు



సమావేశంలో మాట్లాడుతున్న రీజెన్సీ చైర్మన్ నాయుడు

ప్రజలు సహకరిస్తే పరిశ్రమ పునరుద్ధరణ

రీజెన్సీ వ్యవస్థాపక చైర్మన్ నాయుడు

ప్రజాశక్తి - యానాం

యానాం ప్రజలు సహకరిస్తే రీజెన్సీ సిరామిక్ పరిశ్రమ పునరుద్ధరణ సాధ్యపడుతుందని రీజెన్సీ సంస్థల వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ జిఎన్.నాయుడు అన్నారు. మంగళవారం రీజెన్సీ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యానాం ప్రజలతో సుమారు నాలుగు దశాబ్దాల అనుబంధం ఉందన్నారు. రీజెన్సీ అంటే యానాం, యానాం అంటే రీజెన్సీ అనేంతగా ప్రజలతో మమేకం అయ్యామన్నారు. రీజెన్సీ తిరిగి ప్రారంభమైతే వేలాది కుటుంబాలకు అన్నివిధాలా ప్రయోజనం కలుగుతుందని అన్నారు. యానాంకు పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు ఇప్పటికీ తపన పడుతున్నానని, అయితే ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. రీజెన్సీ ముందుకు వెళ్లకుండా అడ్డుపడుతున్న వారిపై చర్యలను ఖండించాలన్నారు. రీజెన్సీ కోసం ప్రభుత్వం అన్నివిధాల అండగా ఉంటుందని ముఖ్యమంత్రి రంగసామి స్వయంగా భరోసా ఇచ్చారని అన్నారు. సిఎం హామీతో కోట్లాది రూపాయలను పెట్టుబడి పరిశ్రమలో ఉత్పత్తికి సన్నహాలు చేశామని తెలిపారు. రీజెన్సీ పరంగా ప్రభుత్వానికి ఒక్క పైసా కూడా బకాయి లేమన్నారు. రీజెన్సీ టైల్స్ ఉత్పత్తి కోసం సహజ వాయువు సరఫరా కోసం కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఆమోదం కోసం ఎదురు చూస్తున్నామని, దీని కోసం సిఎం రంగసామి ప్రభుత్వపరంగా కేంద్రానికి నివేదిక పంపారని వివరించారు. కేంద్రంపై మరింత ఒత్తిడి తీసుకొచ్చేందుకు అందరూ సహకరించాలని అన్నారు. రీజెన్సీ రాకతో యానాం వచ్చే రోజుల్లో అన్ని రంగాల్లో మరింత ప్రగతిబాట పట్టగలదని అన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్ రెడ్డి పారిశ్రామికాభివృద్ధికి ఎంతో పాటుపడుతున్నారని, వారిబాటలో పుదుచ్చేరి ప్రభుత్వం పయనించేలా నూతన పారిశ్రామిక విధానాన్ని అమలు చేయాలని కోరారు. ప్రజా ఉత్సవాల్లో రీజెన్సీ సంస్థపై మల్లాడి కృష్ణారావు చేసిన అభియోగాల అర్థరహితమని అన్నారు. సహజవాయువు సరఫరా అంశం ఒక కొలిక్కి వస్తే రీజెన్సీ పున్నరుద్ధరణకు మార్గం సుమగం కాగలదని, సానుకూల దృక్పథంతో అందరూ రీజెన్సీకి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ గౌరవ కార్యదర్శి ఈలప్రోలు విష్ణువర్ధనరావు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - యానాం

వెంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను రీజెన్సీ సంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ జిఎన్.నాయుడు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు జరుగుతున్న తీరును ఆలయ అర్చకులు ఆయనకు వివరించారు. పిల్లారాయ, సుబ్రహ్మణ్య స్వామి, ఆంజనేయ, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు చేశారు.



రైతులకు చెక్కులు అందజేస్తున్న ఎంఎల్ఎ అశోక్

రైతులకు చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - యానాం

యానాంలోని పలువురు రైతులకు చెక్కులు, మిల్క్ మిషన్లను ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక పశువుల ఆసుపత్రి వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి తగిన కృషి చేస్తానని అన్నారు. యానాంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డైరెక్టర్ డాక్టర్ లతామంగేష్కర్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె.కౌమరన్, గీదా పండు, రైతులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



బాల భవన్ చిన్నారుల నృత్య ప్రదర్శన

అబ్బుర పరిచిన చిన్నారుల నృత్యప్రదర్శన

ప్రజాశక్తి - యానాం

ప్రజా ఉత్సవాలల్లో బాలభవన్ చిన్నారుల నృత్యప్రదర్శన అబ్బురపరిచింది. మంగళవారం రాత్రి జరిగిన నృత్యప్రదర్శనలు చేసిన వారిలో కరక జ్యోతిక నాగలక్ష్మీదుర్గ, బత్తుల రాఘహర్షిత, దూలిపూడి లక్ష్మి లిఖిత, సబ్బతి వెన్నెల, తిక్కిరెడ్డి విజయలక్ష్మి, ఆకుల హిమబిందు, పెన్నాడ అలేఖ్య, పెన్నాడ దేవిహర్షిత, ఆలువల్లు విన్మయశ్రీ, దంగేటి షహర్ష, మట్ట శశి కావ్యశ్రీ, గుర్రం గోదా నాగశ్రీ మనస్విని, కనకాల ప్రభ మనోజ్ఞ, అజ్మీరా ధిత్యశ్రీ, దాసరి మణి చందన, గెడ్డల జాన్వీ సాయిశ్రీ, సంగాని వొను ప్రియ, సోమేశ్వరపు ఈక్షిత సేవల్లి, పువ్వల వెన్నెల, అరదాడి కాశ్వి ఉన్నారు.



స్వాగతం పలుకుతున్న పరిపాలనాధికారి మునిస్వామి, మల్లాడి

యానాం చేరుకున్న పుదుచ్చేరి గవర్నర్

ప్రజాశక్తి - యానాం

యానాంలో బుధవారం ముగిసే ప్రజా ఉత్సవాలు, ఫల పుష్ప ప్రదర్శనలో పాల్గొనేందుకు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాస్ నాథన్ మంగళవారం రాత్రి యానాం చేరుకున్నారు. రాజమహేంద్రవరం విమానాశ్రయం వద్ద ఆయనకు పరిపాలనాధికారి మునిస్వామి, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కండవల్లి రామకృష్ణ, ఎస్పి రాజశేఖరన్ పాల్గొన్నారు.

కొబ్బరి ఆధారిత పరిశ్రమలపై అధ్యయనం

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లాలోని కొబ్బరి ఆధారిత పరిశ్రమల స్థాపనపై అధ్యయనం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పలు రాయితీలతో పరిశ్రమల స్థాపన కోసం అవకాశాలు కల్పిస్తున్నాయని ఆ స్థాయిలో కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కోరారు. ఆ దిశగా కమిటీ సభ్యులు చైతన్యాన్ని తీసుకు వచ్చి ప్రోత్సహించాలని సూచించారు. కొబ్బరి ముడిసరుకు ఆధారంగా వర్జిన్ కోకోనట్, కొబ్బరి వాటర్ ద్వారా పౌడర్ తయారీ, కోకో పిట్ తయారీ వంటి విలువ ఆధారిత రంగాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని సూచించారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పనా పథకం (పిఎంఇజిఎస్) ఉపాధికి ఊతం, ఉన్నతికి మార్గమన్నారు. స్వయం ఉపాధితో పాటు మరో పదిమందికి ఉపాధి చూపేం దుకు, జీవితంలో ఉన్నతికి ఈ పథకం ఉపయోగ పడుతుందని, యువత ఆసక్తికి అనుగుణంగా స్వయం ఉపాధి మార్గాలను చూపడం ద్వారా సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పికెపి.ప్రసాద్, సహాయ సంచాలకుడు శివరామ్‌ప్రసాద్, ఉద్యాన అధికారి బివి.రమణ, డిఆర్‌డిఎ పీడీ శివ శంకర్ ప్రసాద్, డ్వామా పీడీ మధుసూదన్, ప్రోగ్రాం మేనేజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

ఇసుక ర్యాంపు జట్టు కార్మికుల నిరసన

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం ఇసుక ర్యాంపు వద్ద మంగళవారంఉపాధి కల్పించాలంటూ జట్టు కార్మికులు నిరసన తెలిపారు. జట్టు కార్మికుల సంఘ నాయకులు బొక్కా శ్రీనివాస్, పలివెల వెంకట్రావు, రాగం శ్రీనివాస్, మాగాపు నారాయుడు, పీతల రమణ, సంగాని శ్రీనివాస్, బెల్లపు శేఖర్, డొక్కా శ్రీనివాస్, కర్రి బాలరాజు, తెలికోటి రాజు మాట్లాడారు. ప్రభుత్వం జట్టు కార్మికులతో ఇసుక ఎగుమతికి అనుమతించిందని, ఇటీవల లారీలతో రాత్రి వేళల్లో ఇసుక తరలించేస్తున్నారని తెలిపారు. దీంతో ర్యాంప్ బాట పాడై ట్రాక్టర్లు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. దీనిపై ఇసుక తోలకం ఆపినప్పటికీ తమను లెక్క చేయకపోవడంతో రాంపును నిలిపివేసి ఆందోళన చేపట్టామన్నారు. ర్యాంపులో తమకు ఉపాధి కల్పిస్తామని ఉదయం రమ్మన్నారని, ఒక గంట తర్వాత స్టాక్ నిండిపోయింది. మీకు పని లేదని చెప్పారని వాపోయారు. దీంతో ర్యాంపు నిర్వాహకులు జట్టు కార్మికులతో జరిపిన చర్చలు సఫలం కావడంతో ర్యాంపు నిర్వహణ యథావిధిగా సాగింది. ఈ కార్యక్రమంలో జట్టు కార్మికులు బెల్లపు శేఖర్, జట్టు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాంపు వద్ద నిరసన తెలుపుతున్న జట్టు కార్మికులు

చెట్లకు నిప్పు పెట్టిన వారిపై చర్యలు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-ఆత్రేయపురం

పచ్చని చెట్లకు నిప్పు పెట్టి వాటిపై గొడ్డలివేటు వేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటానని అమలాపురం రేంజ్ అటవీ శాఖ అధికారి జి.ఈశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని లొల్ల నుండి ర్యాలి వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డులో చెట్లకు నిప్పు పెట్టి వాటిని ఇటుక బట్టీలకు తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటానని ఆయన పేర్కొన్నారు. ప్రజాశక్తిలో ఇటీవల ప్రచురితమైన కనుమరుగవుతున్న పచ్చదనం.. చెట్లకు నిప్పు పర్యావరణానికి ముప్పు.. అనేకథనానికి జిల్లా అటవీశాఖ అధికారులు స్పందించారు. చెట్ల నరికిన ప్రాంతాన్ని పరిశీలించారు.



చెట్లకు నిప్పు పెట్టిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రేంజర్ ఈశ్వరరావు

చల్లపల్లి కొత్త కాలువకు మోక్షం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

నీటి సంఘాల ఏర్పాటు పుణ్యమా అంటూ చల్లపల్లి కొత్త కాలువకు ఎట్టకేలకు మోక్షం లభించింది. చల్లపల్లి నుంచి ఎస్.యానాం వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర ఉన్న ఈ పంట కాలువలో గుర్రపుడెక్కతో పాటు చెత్తా చెదారం పేరుకుపోయి సాగునీరు దిగక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని ప్రధాన భారీ తాగునీటి పథకం చెరువుకు కూడా ఈ పంట కాలువ ద్వారానే తాగునీరు సరఫరా అవుతోంది. పంట కాలువ తూడు చెత్తాచెదారంతో పూడుకుపోయి అడ్డంకులు ఏర్పడుతున్నా పట్టించుకోవడం లేదని అనేకసార్లు రైతులు ప్రజలు గగ్గోలు పెట్టారు. సాగునీటి సంఘాల ఏర్పాటు అవడంతో చల్లపల్లి సాగునీటి సంఘం అధ్యక్షులు ఉప్పలగుప్తం డిసి చైర్మన్ దంగేటి వెంకటరెడ్డి నాయుడు (చిట్టిబాబు), ఉపాధ్యక్షుడు సుంకర రాంబాబు మంగళవారం దగ్గరుండి యంత్రాలు మనుషులతో చెత్తాచెదారం పూడిక తొలగించే పనులను చేపట్టారు.



పూడికతీత పనులు పర్యవేక్షిస్తున్న చిట్టిబాబు, రాంబాబు

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి

ప్రజాశక్తి-రామచంద్రపురం

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో కార్యకర్తల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రామచంద్రపురం నియోజవర్గంలో పార్టీ సభ్యత్వాలు 55 వేలు, పట్టణంలో 11 వేలకు పైగా నమోదు చేసి లక్ష్యాన్ని చేరుకున్నామన్నారు. కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ పని చేస్తుందన్నారు. కార్యకర్తలంతా ఐక్యంగా ఉండి, పార్టీ కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్లాలని, కార్యకర్తలే పార్టీకి బలమని అన్నారు. స్థానికంగా ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. మంత్రి సుభాష్ తండ్రి సత్యం మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను గుర్తిస్తామని, ఎవరూ నిరాశ చెందనవసరం లేదన్నారు. పార్టీ సభ్యత్వాలు నమోదు లోనూ, నీటి సంఘాల ఎన్నికల్లో సమిష్టిగా కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

కిశోర బాలికల భద్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

కిశోర బాలికల రక్షణ అందరి భద్రత బాధ్యతగా తీసుకుని వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాలని ఐసిడిఎస్ అమలాపురం ప్రాజెక్ట్ అధికారి వై.విజయశ్రీ పేర్కొన్నారు. మంగళవారం అమలాపురం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కిశోర వికాస మండల స్థాయి శిక్షణా తరగతుల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. చదువుకునే వయస్సులో బాల్యవివాహాలు చేస్తే చట్టరీత్యా నేరమని వివరించారు. సమాజంలో బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను ఎదుర్కొనేలా వారిని తయారు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బాబ్జి రాజు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను పక్కాగా అమలు చేయాలి

ప్రజాశక్తి - ఆలమూరు

పని ప్రదేశాల్లో కార్మిక చట్టాలు పక్కాగా అమలయ్యేలా చూడాలని సహాయ కార్మిక అధికారి కాశి శివ నాగమల్లేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన పలు గ్రామాల్లో ఇటుక బట్టీల్లో తనిఖీలు నిర్వహించారు. రిజిస్టర్ల నిర్వహణలో ఉన్న లోపాలను సరి చేసుకోవాలని సూచించారు. కార్మిక సంక్షేమ నిధికి తమ వద్ద పని చేస్తున్న కార్మికునికి రూ.100 చొప్పున బ్యాంకులో చెల్లించాలని, ఫారం ఎఫ్ పూర్తి చేసి నగదు కట్టిన చలానా జతపరిచి కార్యాలయంలో అందజేయాలన్నారు.

ప్రకటన



శ్రీ.శే.లు వరసాల సత్తెమ్మ
w/o వరసాల భద్రయ్య

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం,డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ముమ్మిడివరం నియోజకవర్గం,ముమ్మిడివరం మండలం ,ఠాణేలంక -పెదపేట గ్రామ కాపురస్తులు వరసాల సత్తెమ్మ W/O భద్రయ్య గారు అనారోగ్య కారణంగా **09-06-2000**న, డోర్ నెంబర్ 1-120 ఇంటిలో మరణించారు. వారి మరిది కుమారుడు వరసాల ఇశ్రాయెల్ అను నేను వారుసుడైయున్నను.మా గ్రామమైన ఠాణేలంక గ్రామ పంచాయితీ లో వరసాల సత్తెమ్మ మరణం నమోదు కాలేదు.కావున ఎవరికైనను ఏమైనా అభ్యంతరాలు ఉన్న ఎడల పది రోజులలో తెలియజేయగలరు.

వరసాల ఇశ్రాయెల్
s/o వెంకన్న, డోర్ నెంబర్ 1-120,
ఠాణేలంక గ్రామం, ముమ్మిడివరం మండలం
సెల్:9951367822

సత్యవతి నేత్రాల దానం

ప్రజాశక్తి ఆత్రేయపురం

మండలంలోని పేరవరం గ్రామానికి చెందిన గారపాటి సత్యవతి 70 ఆమె కళ్ళు దానం చేయాలని ముందుగానే అనుకుని విషయం కుటుంబ సభ్యులకు చెప్పింది. మంగళవారం సత్యవతి మతి చెందారు. కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరం శ్రీ రాధాకష్ణ ఐ బ్యాంక్ వారికి సమాచారాన్ని తెలియజేయడంతో వెంటనే వారు వచ్చి సత్యవతి కార్నియాను సేకరించి తీసుకెళ్లారు. గారపాటి సత్యవతి భర్త సుబ్బారావు పేరవరం వయసు 70 2అబ్బాయిలు 2అమ్మాయిలు శ్రీ రాధాకష్ణ ఐ బాంక్ రాజమండ్రి వారు కార్నియా తీసుకున్నారు

భద్రతపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

భద్రత నియమాలు పాటించాలని ఆటో డ్రైవర్లతో కలిసి రూరల్ సిఐ ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అమలాపురం రూరల్ ఎస్ఐ శేఖర్ బాబు, ఆటో యూనియన్ నాయకులు బొంతు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి ఇంద్రావతి

ఇమ్యునైజేషన్‌పై వైద్య సిబ్బందికి అవగాహన

ప్రజాశక్తి - అంబాజీపేట

ముక్కామల పిహెచ్‌సిలో మంగళవారం వైద్యాధికారి డాక్టర్ ఎ.ఇంద్రావతి ఆధ్వర్యంలో ఆశా డే సందర్భంగా ఇమ్యూనైజేషన్ అవగాహన, సమీక్ష నిర్వహించారు. ఇమ్యూనైజేషన్ వల్ల లాభాలు, సైడ్ ఎఫెక్ట్స్, ఆ పిల్లలను పర్యవేక్షించాలని సూచించారు. ఎంసిపి కార్డ్ ఉపయోగాలు తెలియపరచాలన్నారు. ఒక్కొక్క ఆశా కార్యకర్త 10 ప్రెగ్నెన్సీ టెస్టులు చేయాలని సూచించారు. అమలాపురం ఏరియా హాస్పిటల్ వైద్యాధికారి డాక్టర్ సౌమ్య మానసిక వ్యాధుల గురించి, అంబాజీపేట పిహెచ్‌సిలో వైద్యాధికారి కెఎన్.శ్రీనివాస్, సిహెచ్ఒ బి.అప్పారావు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

నా క్లయింటు రాజమహేంద్రవరం అర్బన్, గాంధీపురం-1,డోర్ నెం.48-15-20/1 కాపురస్తుడు జెట్టి షడ్రక్ గారి కుమారుడు జెట్టి సతీష్ నాకు ఇచ్చిన సంజాయిషీ పై ఈ ప్రకటన జారీ చేయడమైనది.
రాజమండ్రి కాపురస్తుడు వట్టూరి సత్యం గారి కుమార్డు వట్టూరి శ్రీనివాసరావు గారు కె.సుసన్న డెవిడ్ గార్లు అగ్రి మెంట్ ఫర్ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ యూనిట్, దివి. **23-11-2004** తేదీతో వ్రాయించుకుని SRO రాజమండ్రిలో రిజిష్టర్డు దస్తావేజు **నెం. 8520/2004**లో రిజిష్టర్డు అయినది తీసుకుని దివి.**02-01-2025** సం॥ము తేదీన తన ఇంటివద్ద గాంధీ పురం-1 నుండి రాజమండ్రి 1టౌన్ పోలీస్‌స్టేషన్ వద్దగల పెద్దమసీదు వద్దకు కలర్ జిరాక్స్ నిమిత్తం, లీగల్ Opinion నిమిత్తం మోటార్ సైకిల్‌కు తగిలించుకుని వెళ్ళుచుండగా మార్గ మధ్య మంలో పడిపోయినది, ఎంత వెదికినా నా క్లయింటుకు దొరకలేదు. ఎవరికైనా దొరికినచో సదరు దస్తావేజు నాకు గాని, నా క్లయింటుకు **(సెల్‌నెం.9381004430)** గాని, ఈ ప్రకటన వెలువడిన 7 రోజులులోగా అందచేయవలెను.

అల్లంకి రఘురామ్
అడ్వకేట్&నోటరీ,జాంపేట
రాజమహేంద్రవరం రాజమహేంద్రవరం
ది.07-01-2025 సెల్:9247465589

CHANGE OF NAME

I, **MOHAMMED HUSNARA W/o MOHAMMED KARIM MOHIDDIN** , Aged - 49 years, Resident of Door no: 45 - 1 - 15/1, Gorakashanapeta, K. Nookaraju Lay - out, Rajamahendravaram, East Godavari District, A.P - 533103. I have changed My Name from **HUSNARA W/o MOHAMMED KARIM MOHIDDIN** [Old Name] to **MOHAMMED HUSNARA W/o MOHAMMED KARIM MOHIDDIN** [New Name]. Henceforth, I'm being called as **MOHAMMED HUSNARA W/o MOHAMMED KARIM MOHIDDIN** for all Future purposes.

మహారాజశ్రీ కొత్తపేట సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఒ.పి.నెం.53/2023

బిట్విన్
శ్రీమతి ముత్యాల సత్య నారాయణమ్మ@సత్యవతి భర్త.ముత్యాల జానకీ రామయ్య, వయస్సు.38 సం॥లు సమనస గ్రామము, అమలాపురం మండలం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రస్తుతం: తండ్రి గనిశెట్టి నాగేశ్వరరావు, మాలకొండయ్య నగర్, వానపల్లి గ్రామము, కొత్తపేట మండలం,డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.

...పిటిషనరు

మరియు

ముత్యాల జానికీ రామయ్య, తండ్రి నాగేశ్వరరావు, కూలీ, వయస్సు 41సం॥లు, సమనస గ్రామము, అమలాపురం మండలం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా

...రెస్పాండెంటు

నోటీసు

పై నెంబరు మ్యారేజ్ ఒ.పి.పిటిషనులో రెస్పాండెంటుకు ఎన్నిసార్లు నోటీసు పంపించిననూ త్రిప్పివేయుచున్నారు. పై పిటిషను ది. **29-01-2025** తేదీన వాయిదా అయివున్నది. కావున మీరు పై కోర్టు నందు పై తేదీన ఉదయం గం॥**10.30** ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరై మీ వాదన తెలియజేసుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానము తెలియజేయబడునని. ఇందుమూలముగా తెలియజేయడమైనది.

యస్.ప్రసన్న కుమార్
ఐ.నవీన్ కుమార్
అడ్వకేట్స్, కొత్తపేట
కొత్తపేట
ది. సెల్:8978130963